శా ర ద

ఆపంట మంగళాంబ గారు

౧

శ్రీనాడు పౌర్ణమి. పిండియారపోసినట్లు వెన్నెలకాయుచుండెను. సముద్రము పెద్ద పెద్దతరంగములతో మహాసంతసమున ఉప్పొంగిపోవుచుండెను. అట్టి సముద్రపు టొడ్డున యెంతవిసుగుదల మనసుతో నున్నవారికైనను మనసు నిర్మలమగునట్లుండెను. ఆసముద్రపు టొడ్డున యిద్దఱు యువకులు ఆంతరంగికముగ నేదియో ప్రసంగించుకొనుచుండిరి. రాత్రి 12 గంటలయ్యెను విశాఖపట్టణమంతయు మాటుమణిగినది. వారి క్రిందివిధముగ సంభాషణజరిగెను.

మొదటివాడు.—ఏమోయ్ ! వసంతరావూ ! నీవేదియో గూఢమగు సంగతిని గురించి ఆలోచించుచున్నటు లున్నది.

వసం.—ఏమియును లేదు. నీకు తెలియని సంగతి నామనస్సునందొకటియు నుండదు. నామనస్సులోనున్న దంతయు యెప్పటికప్పుడు నీకు చెప్పుచునే యుందును. కృష్ణా ! అదేమియో గాని నామనసు మిక్కిలి భారముగానున్నది.

కృష్ణ.—నీవు నాకు యేమియుచెప్పుట లేదని నేను యెప్పుడును నీమీద అనుమానపడియుండ లేదు. ఇకముందును అట్టి అంతరాయము లెవ్వియురాకుండ మన ఆబాల్యప్రేమను వృద్ధిచేయుటకై భగవంతుని కనేకవందనము లర్పించుచున్నాను. మన మెప్పుడు ఇట్లు కలిసిమెలిసియున్న మన జీవితములో యింక కావలసినదేదియు లేదని నేను గట్టిగా చెప్పగలను. నేను...

వసం.—అబ్బా కృష్ణా ! నీవేదియో మన స్నేహమునుగూర్చి పెద్ద పెద్ద ఉపన్యాసము లిచ్చుచున్నావు, కాని నాకుమాత్ర మవన్నియు తలకెక్కుటలేదు. మనసులో చాల ఆందోళనగానున్నది. అదినీతో చెప్పినగానితీరదు. సావధానుడవై వినుము. ఇవ్వాళ

మానాన్నగారు, నేను భోజనముచేయుచుండగా మా అమ్మ నన్నొక క్రొత్తప్రశ్న వేశింది. అదిగాక...

కృష్ణు.—నేను నీమనసులో యిటువంటిదే యేదోయున్నదని అప్పుడే అనుకున్నాను. అదేమిటో నాకు తెలుసునులే. నామనసంతయు నీమనసులో ఐక్యమయినదనుకో. అదేమిటో నేను చెప్పనా? వద్దులే, నీకు కోపమువచ్చును. ఆ చెప్పుమరి.

వసం.—యేమి కృష్ణా! నన్ను విసిగించెదవు. నామాటకడ్డురాకు. నేను చెప్పునది విను. మా అమ్మ పెళ్లి చేసుకుంటావా? అని నన్నడిగింది. నేను కొంచెము సిగ్గుతో బి.యల్. ప్యాసైంతరువాత చేసుకుంటానులే. తొందరేమన్నాను. ఆమె కొంచెము విసుగుతో అదికాదురా నాయనా! ఇప్పుడు బి. యే. ప్యాసయినావా మరి వివాహము చేసుకుంటే నీవు ప్లీడరీప్యాసయే టప్పటికి పిల్లయింటికి వస్తుంది. మీ కాపురముచూడ నాకు ముచ్చటగ నుండును. ఇవ్వాళే బెజవాడనుంచి 4 వేలు కట్నమిచ్చి ఆడబిడ్డకు 5 వందలు, వియ్యపురాలికి 5 వందలు కట్నమిచ్చి పిల్లనిచ్చెదమని సంబంధమువచ్చినది. ఆమె యింక యేదియో చెప్పబోవునట్లుండెను. కాని నాకు విన నిచ్ఛజనించలేదు. అప్పటికి నాభోజన మగుటవల్ల నేను చెయ్యికడిగికొని వెఱ్ఱివానివలె మీయింటికివచ్చి నిన్ను తీసుకొని ఇక్కడ హాయిగనుండునని ఈ సముద్రము దగ్గిరకు వచ్చితిని. మా అమ్మ మాట్లాడుచున్నంత సేపు కూడా మానాన్నగారొక్కమాటయినను మాట్లాడలేదు. ఆయన పూర్వాచారపరాయణుడు. సదాచారసంపన్నుడు. వివేకశాలి నామనసు కనిపెట్టేయేమిటోగాని ఆయన పోనీ చేసుకోరా నాయనా అనిమాటమాత్రమైనను అనలేదు. మా అమ్మ ఆమాటలు చెప్పుచున్నప్పుడంతయు నా మనసులో యేదియో కలవరముగనే యున్నది. ఘోరపాపమున కొడిగట్టబోవుచున్నట్లు తోచినది. అదివరకే నామనసెవరికో దత్తమైనట్లు నా అంతరాత్మ బోధించుచున్నది. నేను మనసులో వరించిన కన్యను తప్ప అన్యబాలికను చేపట్టతలచునాస లేదు.

ఇంతలో ఒంటిగంటవినబడెను. అబ్బా చాల పొద్దుపోయినదని ఇరువురును సమీపమున నున్న తమ చదువులగదిలోనికి పోయిరి.

౨

విశాలాక్షమ్మగారొక పెద్దపట్టుదలమనిషి. ఆమెకు అన్నియుకావలెను. ఒకటియు పూర్తిగ తెలియదు, తెలిసినమనిషికాదు, తెలియనిమనిషికాదు. ఆమెమాట నెరవే

రుటయే ఆమెకు ప్రధానము. తెలిసినవారికైనను చెప్పవచ్చును. తెలియని వారికైనను చెప్పవచ్చును. తెలిసియు వినని వారికి చెప్పుట బ్రహ్మకైనను వశముగాదు. పాపము ఈమెతో సదాచారసంపన్నుడైన శ్యామలరావుగారు గుట్టుగా కాపురము చేయుచున్నారు. ఈమె పుత్రుడగు వసంతరావు వివాహవిషయములో కట్నము తీసికొని గొప్పయింటి పిల్లను చేయవలెనని మహాపట్టుపట్టినది. రంగమ్మ కూతురు శారదను చేసికొనుటకు ఆమె ఇంటిలోనున్న ఆడబిడ్డ కిష్టములేదు ఆమెకు డబ్బే ప్రధానము. అందుచేత ఆమెకు అచ్చటను ముచ్చటలు జరుపలేని రంగమ్మగారితో వియ్యమందుటకు మనస్సు అంగీకరింపలేదు. ఆమె కుమార్తె వరలక్ష్మమ్మ యీమెయంతకాకున్నను యించుమించు యీమెరకమే. తల్లి గుణములు కూతురికిని తండ్రిగుణములు మగపిల్లలకును వచ్చునని లోకోక్తి. అదెంత నిజమోగాని యీవరలక్ష్మిమ్మ దగ్గిర ఆలోకోక్తి కొంతసార్థకమైనది. తల్లీకూతురు యెప్పుడు చేరినను వసంతరావుపెళ్లి ముచ్చటలే.

వర—అమ్మా! అన్నయ్య పెళ్లియెప్పుడమ్మా యింకాను?

విశా—ఏమో తల్లీ! ఇంటిలో మన మాటలేగాని మీనాన్నగారేమియు పట్టించుకొనరు. అన్నయ్యతో యెత్తితే అసలే పెంకె.

వర—అదికాదమ్మా. అన్నయ్యకు శెలవలుకూడ అయిపోవుచున్నవి. వేసంకాలంలో అయితే మనకెక్కువ అనుకూలముగ నుండును. మీ అల్లుడుగారికి కోర్టుకు శెలవలుకూడాను.

విశా—అవునమ్మా! నాకును అదియేకోరిక. నాకైనా నీవొక్కతెవే కదా ఆడపిల్లవు. కూతురు, అల్లుడువచ్చి యింటిలో పెళ్లిపెత్తనము చేయవలెనని చాల మనసుగా నున్నది. దైవఘటన యెటులున్నదో తెలియదు. మన ప్రయత్నమేమియును లేదు.

వర—నిజమేనమ్మా! నీవు చెప్పినటుల మన ప్రయత్నమేమియును లేదు. అంతయును అన్నయ్య చేతిలోనున్నది. నీవనినటుల అన్నయ్య మొదటినించీ పెంకెవాడు. పెళ్లిసంగతి యెత్తిన యేమిటో వేదాంతపు ఉపన్యాసము లిచ్చును. అసలది పుట్టుకతోవచ్చినబుద్ధి. అదిప్పుడు నీవు నేను చెప్పిన పోవునదికాదు.

విశా—యెట్లైనను ఈ జ్యేష్ఠమాసములో ముడిపెట్టవలెనని వున్నది. తరువాతైతే ఆషాఢకాలము.

ఎప్పుడును వారికీవిధముగ సంభాషణ జరుగుచుండును. ఆడబిడ్డ కూతురిని చేసికొనుట ఈమెకిష్టములేదని ఇదివరకే అందరికి తెలిసినవిషయమేగదా? పిల్ల చాలా బుద్ధిమంతురాలు. కాని మంచివారి మంచి మంచివారికే తెలియునుగాని ఇతరులకేమి తెలియును? ఈవిధముగ సర్వదా కొడుకు పెళ్లినిగురించి భావసౌధములు నిర్మించుచుండును. కూతురు అత్తవారింటినించి వచ్చినప్పుడు యిద్దరును కలిసి యింటిలో వసంతరావుతోను, శ్యామలరావుగారితోను కొంత చర్చ జరుపుచుందురు. పాపము యిదంతయు ఒక్కొక్కపుడు చిన్నకలహరూపముగకూడ పరిణమించి విరమింపబడుచుండెడిది. ఈవిధముగ కొన్నిరోజులు గడచెను. పిల్లవానికి యింకా నెలరోజులు మాత్రమే శెలవలుండెను. ఈమెకు పెళ్లినిగురించి ఆదుర్దా యెక్కువగుచుండెను. తొందరలో గొప్పసంబంధము చూసి స్థిరపరచవలెనని. లేనియెడల తండ్రికి కొడుకునకుకూడ ఆడబిడ్డకూతురగు శారదను చేసికొనవలెనని యిష్టమున్నట్లు కనపడుచున్నది. ఒకవేళ ఆబీదపిల్లను చేసికొనవలసి వచ్చునేమో అన్న ఆలోచన ఈమెను కలవరపరచ సాగెను. ఆడబిడ్డకూతురుని చేసుకొనుటలో యీమెకున్న అభ్యంతరములు మూడు (1) తనకూతురికి లాంఛనములు సరిగ జరగవని (2) గొప్పవారితో వియ్యము పొందితిమన్న గొప్ప తనకు దక్కదని (3) ఆడబిడ్డ మాత్సర్యము. ఈమూడు కారణములవల్ల ఆమెకు ఆపిల్లన్న యిష్టము లేక యితరసంబంధములను గురించి ఆలోచన లెక్కువగుచుండెను. తనకొడుకు చేసికొన్నను యింకెవ్వైన సంబంధము చూచిచేసినను మొత్తముమీద శారద వివాహబాధ్యత శ్యామలరావుగారిమీదనే వున్నది. అందుకని ఆయన తన కొడుకుకు చేసికున్న ఉభయఖర్చులు కలిసి వచ్చుననియు, పైగాపిల్లబుద్ధిమంతురాలు, పిల్లవానికి పిల్లకు యిష్టమున్నట్లు కనపడుచున్నది, కనక ఆపిల్లను తనకొడుకుకు చేసుకొనవలెనని సంపూర్ణాభిప్రాయముతోనున్నాడు. కాని యింటిలోని వారికి ఆసంబంధమన్న యిష్టములేదని తెలిసి యెవ్వరితోడను తన అభిప్రాయము వెలిబుచ్చలేదు. ఆయనకేమైన అయిష్టమగు సంగతిని గురించి ప్రసంగించుట అంతగా ఇష్టములేదు.

3

వరలక్ష్మి అప్పుడప్పుడు తన అన్న దగ్గిరకువెళ్లి "అన్నయ్యా! ఒక్క చెల్లెలినయిన నాకోరిక తీర్చవా? తొందరలో పెళ్లి చేసికొనరాదా? ఆడబిడ్డ లాంఛనములను పొందవలెనని నాకెంతయో మనసుగనున్నది. మంచి మంచి సంబంధములు కూడ వచ్చు

చున్నవి. ఆలసింపవలదు.” అని తరిచితరిచి తొందరపెట్ట మొదలు పెట్టెను. వసంతరావును యిదియే మంచితరుణమనుకొని ఒకరోజున తన చెల్లెలి మూలమున తన తల్లికి తన యభిప్రాయమును తెలియపరచ తలచుకొని “అమ్మాయీ! మాటిమాటికి నన్నిట్లు తరిచితరిచి ప్రశ్నించెదవేలా? మన అత్తకూతురును; నాకు వయసులోను వరస లోను కూడ సరిపోయినదియు నగు మరియును ముఖ్యముగ సుశీలవతియునగు మన శారద ఉండగ యితర సంబంధములను గురించి అనవసరముగ చర్చించెదవేల? మీా అభిప్రాయమేమిటోనాకు బోధపడకున్నది.” అని యీావిధముగ కొంచెము గట్టిగ చెప్ప గనే శ్రుతిమించి రాగమున పడునేమోఅని సందేహించి వరలక్ష్మి తల్లిదగ్గరకు వెళ్లి పోయెను. ఈ సంభాషణ పక్కగదిలోనున్న రంగమ్మగారి చెవినిబడెను. ఆమె యెప్పుడు యేదో భగవధ్యానము చేసికుంటూ తనకు నియమింపబడిన చిన్నగదిలో ఉండును. ఒక్కొక్కప్పుడు తన కూతురగు శారదచేత నేవిదైననను సద్గ్రంథములు చదివించుకొని వినుచుండును. అన్నగారు భాగ్యవంతుడగుట వల్లను, ఇంటినిండ పనిపాటలవారు దండిగ నుండుటచేతను యీామెకు పని అవసరము అంతగా వుండెడిదికాదు. అయినను అవ సరము వచ్చినప్పుడు చెయ్యని మనిషిమాత్రము కాదు. వసంతరావు దృఢమనస్సుతో పల్కిన మాటలను విని ఈమె పరమానందభరితురాలయింది. తన జీవితములో తనకు ముఖ్యమైన ఒకవిధి నెరవేరినదిగ భావించింది.

వసంతరావు తరుచు తన వివాహమును గురించి ఆంతరంగిక మిత్రుడగు కృష్ణునితో ప్రసంగించుచునే యుండెను. ఆతడుకూడ శారదను చేసికొనుటయే అనేకవిధముల శ్రేయ స్కరమని చెప్పెను. తొందరలో పెళ్లిచేసికొనమని కూడ చెప్పెను. అదిగాక అతనికి కొద్దిరోజుల కిందటనే వివాహమాయెను. అన్నివిషయములలోను తన ముఖ్యమిత్రుడు తనతో సమానముగనుండవలెనని అతని నిండుకోరిక. స్నేహితునికి యిష్టమయినది తండ్రి కిని ఇష్టమున్నట్లు వసంతరావు గ్రహించినాడు. అత్తగారి కీవివామును గురించి యిష్టముండు నని వేరే చెప్పనక్కరలేదుగదా! పేదకు పెన్నిధి దొరికినచందమున అట్టి స్థితిలోనున్న ఆమెకు యీాసంబంధమును గురించి యెంతకుతూహాలముగ నుండునో వేరే చెప్పనక్కర లేదు. ఈసంగతి వసంతరావునకును తెలియును. ఎంతయిష్టమున్నను, కుతూహాలమున్నను ఆశయున్నను పాపము రంగమ్మగారు మాత్రము ఒక్కసారైనను నోరుతెరచి అన్నగారిని ఆయన పిల్లవానికి తన పిల్లను చేసికొనమని అడగలేదు. అది ధర్మము కాదని ఆమె

యుద్దేశ్యము. వదినగారికి యిష్టములేదని తెలిసియు అన్నగారిని నిర్బంధించుట అన్యాయము కాదామరి. కించిత్ జ్ఞానమున్న వారికి ముందువారికి రాబోవుమాట ఆలోచించుకొని మాట్లాడవలెనని తోచును. అదిగాక కర్మము జాలక యీమెయెప్పుడైన యింకేదైన సంగతినిగురించి అన్నగారితో మాట్లాడుచున్నను శారదవివాహ విషయమే మోనని విశాలక్షమ్మగారి కొక పెద్ద అనుమానము. అందుకని అసలు ఆమె తనలో తాను కాలక్షేపణ చేసుకొనెడిదిగాని యెవ్వరితోడను అమితముగా సంభాషించెడిదికాదు.

౪

ఇంక వసంతరావునకు మిగిలినది శారదప్రేమాన్వేషణ మొకటియే. ఈవిషయములో అనుదినమును మనసులో ఘోరతపస్సు చేయుచుండెను. అతనికి జ్ఞానమున్నంతవరకు అతని మనసుకు శారద తన్ను ప్రేమించుచున్నట్లే తోచెను. ఆమె చూపు తనయందు ప్రసన్నముగనే కనపడుచుండెను, అపిల్ల తనను చూసి ఒక విధమగు సిగ్గుతో వెడలిపోవుట, తానన్న ఒక మోస్తరు కుతూహలముకనపరుచుట, తనకు తెలియకుండ తన పనులను ఒక్కొక్కప్పుడు చేయుట, యివన్నియు సూక్ష్మగ్రాహియగు వసంతరావు గ్రహించెను. ఇక నతనికి పరమానందం అంతకన్న కావలసినదేమున్నది? తను కోరిన కన్యక తనను ప్రేమిస్తున్నట్టు తెలిసినప్పుడు ఆనందముగ నుండదా? కాని ప్రత్యక్షముగ అడిగి తెలిసికొనిన బాగుండునని తలచుచుండెను. అదెట్లు సాధ్యమగునో అతని కేమియు బోధపడకున్నది. వెళ్లి నన్ను పెళ్లి చేసికొనుట నీకిష్టమేనా అని అడుగుదమన్న అదికొంచెము మోటగ నుండును. అదిగాక సిగ్గు. ఆపైన ఆమె సరియైన జబాబిచ్చునో ఇయ్యదో అన్న సందేహము. ఇతనిస్థితి యిట్లున్నది. శారదయు బావను చేసికొనవలెనని సంపూర్ణాభిప్రాయముతోనున్నది. కాని ఆమె ఒంటరిగ యెప్పుడైన తన వివాహము సంగతి తలచుకున్నప్పుడు మాత్రము బావయిష్టము కనుగొన వలెనను తలంపు ఆమెకు కూడ కలదు.

ఒకరోజున శారద దొడ్డిలో దూరముగానున్న నారింజచెట్టు దగ్గిర కూర్చుని శకుంతల నాటకము చదువుకొనుచుండెను. వసంతరావును అప్పుడు అక్కడికి వచ్చుట తటస్థించెను. ఇది తనకు నొక మంచిఅవకాశమని వసంతరావు సిగ్గువిడిచి నెమ్మదిగా శారదదగ్గిరకు వెళ్లి నిల్చెను. తనను చూసినప్పుడు సిగ్గుతో పరుగిడు బావ తన యెదుట నిర్భయముగ నిలబడుట చూచి శారద కొంచెము చకితురాలయి తనుకూడా పుస్తకము చేతితో పట్టుకొని లేచినిల్చుంది. "ఏమిటి చదువుతున్నా" వన్నాడు వసంతుడు,

మృదుస్వరముతో నెమ్మదిగా "శకుంతల నాటక"మంది.

"యేభాగము చదువుచున్నావు?"

"దుష్యంతుడు కణ్వమహాముని ఆశ్రమమునకువచ్చి ఒంటరిగనున్న శకుంతలను తన్ను వివాహమాడమని కోరుఘట్టము."

"ఐతే నేనిప్పుడు దుష్యంతుడినయి పోయినానన్న మాట." దాని భావమును గ్రహించియు సిగ్గువల్ల జవాబియ్య లేక శారద నవ్వి ఊరకుంది. కాని అంతటితో వసంతుడు నిరాశచెంద లేదు.

"నీవు శకుంతల వవుతావా?" అన్నాడు.

"మహాప్రసాద మంది" చిరునవ్వుతో. భార్యాభర్తల ప్రేమ నిశ్చయముగ సంపూర్ణముగ స్థిరపడినది. దీనితో ఉప్పొంగిపోయినాడు వసంతుడు. శారద ఆంతకన్న మిన్ను ముట్టెను. ఇక మిగిలినది వివాహయొక్కటే. అదియును మూడువంతులు స్థిరమే.

వధూవరులు, వధువుతల్లి, వరునితండ్రి అంగీకరించిన వివాహమునకు విశాలక్షమ్మ, వరలక్ష్మమ్మ అడ్డుపెట్ట గలరా?

పతివ్రతా ధర్మములు

అయ్యదేవర బాలాత్రిపురసుందరమ్మగారు

భర్తయం దెంత మక్కువ బరగియున్న
కాంతలకు గల్గు నంతటి గౌరవంబు,
ననెడు నార్యోక్తి సతతమ్ము మదినినిల్పి
ధరణిలోపల విఖ్యాతిదాల్పవమ్మ.

గృహమునందలి పనులను నింపుమీర
నాచరించుచునుండుమి మీ యంబుజాక్షి!
పరమదాంపత్యసుఖముల బడయవమ్మ
ధరణిలోపల విఖ్యాతిదాల్పవమ్మ.

ఇతరగృహములకేగుట లేదుకమ్మ
చదువుకొనుట మనసు నీజన్మమందు
తెలియనేరని సంగతుల్ తెలుపునమ్మ
నీదుకాలంబు వృధయగానీయకమ్మ.

అన్నమోయంచు వచ్చెడి యతిథులందు
కినుకబూనక మిక్కిలి కనికరమున
కూరగాయలు పచ్చళ్లు కూడుబెట్టి
అతివ! చేయుచు నుండుమీయతిథి పూజ.